

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం, ఏప్రిల్ 24, 2026 పేజీలు :5


# భగీరథుని జీవితం... యువతకు ఆదర్శం

## నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

## కలెక్టరేట్లో ఘనంగా భగీరథుని జన్మదిన వేడుకలు



నాగర్ కర్నూల్ 23 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )

భగీరథుని జీవితం యువతకు ఆదర్శనీయమని, తెలంగాణ రాష్ట్రం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారకంగా నిర్వహిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి నీ పురస్కరించుకొని శాసనమండలి సభ్యులు కూచుకుల్ల దామోదర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ భగవాన్ సంతోష్ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)**

టీజీఎస్ఆర్టీసీ (టీజీ ఎస్ఆర్ టిసి) జేఏసీ సమ్మె నేపథ్యంలో నారాయణపేట పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆర్టీసీ డిపో మేనేజర్ తో మాట్లాడి బస్సుల రాకపోకలు మరియు డిపో వద్ద నెలకొన్న



## కక్ష సాధింపే కాంగ్రెస్

# పాలనా ధోరణి

### ఆర్టీసీ సమ్మె నుంచి కాళేశ్వరం వరకు ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఘాటు విమర్శలు

### కార్మికులు, రైతులు, ప్రతిపక్షాలపై వేధింపులు పెరిగాయని ఆరోపణలు



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో) మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహా పలువురు నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, కార్మికులపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు కొత్త డిమాండ్లు చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని అన్నారు. వరంగల్‌లో ఒక కార్మికుడు తీవ్ర ఆవేదనతో

## పేట కలెక్టరేట్ లో ఘనంగా మహర్షి

# భగీరథ జయంతి

నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)

నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహర్షి భగీరథ జయంతి వేడుకలకు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి మాట్లాడుతూ...భగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నారు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ముడు గంగాదేవిని భూమికి పంపించాడనీ, అందుకే మనము గంగా నదిని భగీరథి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకువచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు



## కక్ష సాధింపే కాంగ్రెస్

# పాలనా ధోరణి

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ప్రస్తావిస్తూ, అతనికి ఏదైనా జరిగితే దానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. తాండూర్‌లో కార్మికులకు టెంట్లు ఇచ్చిన వారిపై నోటీసులు ఇవ్వడం అన్యాయమని, ప్రజలకు సేవ చేసే కార్మికులకు అడ్డంకులు సృష్టించడం సరైంది కాదని విమర్శించారు.
మహాలక్ష్మి ఉచిత పథకం పేరుతో ఆర్టీసీకి రూ.1400 కోట్ల బకాయిలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు యూరియా అందడం లేదని, విద్యుత్ సరఫరా సరిగా లేదని, రైతుబంధు ఇవ్వడం లేదని, పంట కొనుగోళ్లు జరగడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు చేయకుండా రాజకీయాల కోసం కాలయాపన చేస్తున్నారని, వెంటనే పనులు పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ పేరుతో మూడు సంవత్సరాలు కాలయాపన చేసి ప్రజాధనం వృథా చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సమస్యలు ఉన్నప్పటికీ రాజకీయ కారణాలతో మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మీడియాపైనా ఒత్తిడి తీసుకువచ్చి ఆర్టీసీ సమస్యలను కవర్ చేయవద్దని బెదిరింపులు ఉన్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఇంజనీర్ల ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తప్పుడు కేసులు నమోదు చేసి ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి కంటే కేసులు, కమిషన్లపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. కేసులు పెట్టినా భయపడమని, ప్రజా సమస్యలపై ప్రశ్నలు అడుగుతూనే ఉంటామని స్పష్టం చేశారు.
ఈ ప్రెస్ మీట్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.
అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఆందోళనలకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించారు. జిల్లా లోని రెండు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోంది, ఆర్టీసీ విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఎవరు భయపడకుండా తమ విధులకు హాజరు కావాలని అందుకు పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుంది అని తెలిపినారు. మరియి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యాలు కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ తో పాటు ఎస్ బి ఎస్ ఐ నరేష్, ఎస్ ఐ లు వెంకటేశ్వర్లు, రాజు పోలీసు సిబంది ఉన్నారు

## ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### : నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి

వనపర్తి ఏప్రిల్ 23
ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి మరియు సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దిశా కమిటీ చైర్మన్, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి, కో చైర్మన్ మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ హాజరయ్యారు. వీరితోపాటు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఉన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల వారీగా సమీక్షించిన ఎంపీ, అధికారులు తమ పరిధిలోని పథకాలను ప్రజలకు చేరవేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

జిల్లాలోని విద్యా, వైద్య, రహదారులు భవనాలు, సంక్షేమ శాఖలు, పౌరసరఫరాలు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పీఎం సూర్య ఘర్ అనే పథకానికి సంబంధించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. తద్వారా ప్రజలు దానిని వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోగలరని తెలిపారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో జీవాలకు సకాలంలో టీకాలు వేసి రైతులకు సహకరించాలని సూచించారు.

హౌసింగ్ శాఖకు సంబంధించి జిల్లాలు మొత్తం 6,203 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, వాటిలో కేవలం 4864 ఇండ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని, మిగతా 1340 ఇండ్లను వేగంగా గ్రౌండింగ్ చేసి నిర్మాణాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారికి ఆదేశించారు. ఇండ్లు మంజూరు అయిన తర్వాత కూడా లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభించుకోకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక కారణాలవల్ల ఇండ్ల నిర్మాణం చేసుకోలేని వారు ఉంటే వారికి స్వయం సహాయక బృందాల ద్వారా రుణాలు ఇప్పించాలని సూచించారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన వారై ఉంటేనే వారికే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించామని కాబట్టి వారందరూ ఇల్లు కట్టుకునే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి విద్యార్థులకు స్కాలర్షిప్లు పెండింగ్ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి ఏమైనా పెండింగ్ ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. అన్ని సంక్షేమ శాఖల వసతి గృహాల్లో ఖాళీ సీట్లు ఉంటే ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వనపర్తి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి శాఖ పరిధిలో పెండింగ్లో ఉన్న రోడ్ల పనులను వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం కావాల్సిన అటవీశాఖ అనుమతులు వేగంగా జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనపర్తి పట్టణంలో రోడ్ల విస్తరణ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలో నిర్మిస్తున్న ఆసుపత్రి నిర్మాణం, పెబ్బేర్లో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు.



## గిరిజన విద్యార్థులకు బంగారు అవకాశం

- బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానం
- మే 7లోగా దరఖాస్తులు సమర్పించాలని అధికారుల సూచన

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో)**
మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన బాలబాలికల నుంచి 2026--27 విద్యా సంవత్సరానికి “బెస్ట్ అవైలబుల్ స్కూల్” పథకం కింద 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రూ నాయక్ తెలిపారు. జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 35 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మే 7లోగా తమ పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూము నంబర్ 123, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం, పాలకొండ, మహబూబ్‌నగర్ వద్ద సమర్పించాలని కోరారు. ఏప్రిల్ 22 నుంచి దరఖాస్తు పత్రాలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చిన దరఖాస్తుల నుంచి మే 14న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా 35 మంది విద్యార్థులను ఎంపిక చేస్తామని వెల్లడించారు.దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతానికి రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతానికి రూ.2,00,000 లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తుతో పాటు కుల, నివాస, ఆదాయ ధృవీకరణ పత్రాలు (తహసీల్దార్ లేదా మీ సేవ ద్వారా పొందినవి), రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జతపరచాలని ఆయన తెలిపారు.

## భగీరథుని జీవితం... యువతకు ఆదర్శం



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి పట్టుదల సేవా గుణం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని కలెక్టర్ వ్యాఖ్యానించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగా నదిని భూమికి తెచ్చిన మహనీయుడు భగీరథుడు చరిత్రలో నిలిచిపోయారన్నారు. గొప్ప ప్రయత్నాలను భగీరథ ప్రయత్నంగా పిలుస్తారన్నారు. ఎమ్మెల్సీ కూచికుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వారి త్యాగం ఆదర్శనీయమని కొనియాడారు. తరగతుల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అదేవిధంగా సాగర కుల సంఘం నాయకులు వార్తలు భగీరథుని స్మరిస్తూ, ఆయన విగ్రహాన్ని సాగర కుల భవనాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్సీకి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా మహర్షి భగీరథ జయంతి

భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ అర్ వో ఎం.ఏ.రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజనేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజాప్రతినిధులు, బి . సి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# లంకాలలో ఘనంగా శ్రీ శ్రీ శ్రీ భగీరథ మహర్షి జయంతి






**నర్వ ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం నారాయణపేట జిల్లా నర్వ మండల పరిషత్ కార్యాలయము తో పాటు మండలంలోని రాంపూర్, యాంకి, ఉండేకోడ్, రాయికోడ్, నర్వ, కల్వాల్,లంకాల గ్రామాలల్లో గ్రామ పంచాయతీ, సగర సంఘము అధ్యర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.నర్వ మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా శ్రీ శ్రీ శ్రీ భగీరథ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణా రెడ్డి లు హాజరయ్యారు.అయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధీవి నుండి భువికి గంగాను తీసుకువచ్చిన మహా ముని ఇక్ష్వాకు వంశానికి చెందిన భగీరతుడు అయన జయంతి జరుపుకోవడం అభినందనమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘు, రాంపూర్ గ్రామ సర్పంచ్ నాగరాజు సాగర్,సగర సంఘం నాయకులు బీసం రామకృష్ణ సాగర్,బీసం బాలరాజు సాగర్,వెంకటయ్య సాగర్,కృష్ణయ్య సాగర్, పాండు సాగర్ నర్సింహా సాగర్,కేశవులు సాగర్,ఉద్యోగ సంఘం నాయకులు వెంకటేష్ సాగర్, శ్రీనివాసులు సాగర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు,సగర సంఘం నాయకులు, సగరులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు గ్రహీతకు మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్ ఆత్మీయ సన్మానం

**చిన్నంబావి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలంలోని బెక్కెం గ్రామంలో దళిత హక్కుల సాధన కోసం రెండు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తున్న సామాజిక కార్యకర్త ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవని రమేష్‌కు ఘన సన్మానం జరిగింది. ఇటీవల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా‘దళితరత్న’ అవార్డు అందుకున్న రమేష్‌ను చిన్నంబావి మండల మాజీ సర్పంచ్ పసుపుల రంజిత్ కుమార్ శాలువా కప్పి, స్వీట్లు తినిపించి ఆత్మీయంగా అభినందించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో దేవని రమేష్ చేసిన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డుతో సత్కరించడం ఆనందదాయకమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే తపనతో సేవలు కొనసాగిస్తూ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీత దేవని రమేష్ మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ఈ గౌరవం అందించడం గర్వకారణమని తెలిపారు. ఇదే స్ఫూర్తితో సమాజానికి మరింత సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉప సర్పంచ్ బిచ్చన్నతో కలిసి రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంచారు.ఈ



కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు డీఎన్ సహదేవ్ మాదిగ, మండల నాయకులు కాకనూరి రామకృష్ణ, గ్రామ నాయకులు వేణు, సీనియర్ నాయకులు దేవని హోటల్ రాముడు మాదిగ, బండారు ఉమేష్ చంద్ర మాదిగ, డీఎన్ రాము మాదిగ, బోరెల్లి రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ పై ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్ల. లక్ష్మీకాంతరెడ్డి**

**నర్వ ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి**

భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత దౌర్భాగ్యకరమని బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం పత్రికా విలేకరులకు ఒక ప్రకటనలో తెలుపుతూ మాట్లాడారు, . ?ప్రజాస్వామ్య దేశంలో ఒక ఉన్నతమైన పదవిలో ఉన్న వ్యక్తిని, కోట్లాది మంది ప్రజల ఆశీస్సులతో ఎన్నికైన ప్రధానిని ‘టెర్రరిస్ట్’ అని అనడం ఖర్గే గారి అజ్ఞానానికి, కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్న తరుణంలో, మన దేశ ప్రధానిపై ఇలాంటి నీచమైన పదజాలాన్ని ఉపయోగించడం దేశ ప్రతిష్టను భంగపరచడమేనన్నారు.శ్రీ నరేంద్రమోడీ గారు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి విమర్శలకు దిగుతున్నారన్నారు. గతంలో కూడా అనేకమంది కాంగ్రెస్ నేతలు ప్రధానిపై వ్యక్తిగత దూషణలు చేసి ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు. శ్రీ మల్లికార్జున ఖర్గే లాంటి వారు ఇలా మాట్లాడాల్సింది కాదని, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, దేశ ప్రజలకు మరియు ప్రధానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమని, కానీ అవి హుందాగా ఉండాలని, ఉగ్రవాదం వంటి తీవ్రమైన పదాలను ప్రధానిపై వాడటం ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ స్థాయిని తగ్గించుకుని దేశ ప్రజలు అసహించుకునే విదంగా మాట్లాడుతున్నారని బంగ్ల లక్ష్మికాంత్ రెడ్డి తెలిపారు.



## ఈ నెల 30న,ఉచిత కంటి చికిత్స శిబిరం

**నాగర్ కర్నూల్ :ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)**

జిల్లావైద్యఆరోగ్యశాఖ,జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలోఈ నెల 30న, ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొ్ట్ర బాలాజీ తెలిపారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవనం లోని గదినెంబర్ 102 లో కంటిశిబిరం ఉదయం 9:00 నుండి 11:00 గంటల వరకు వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరంలో ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణపరీక్షలు నిర్వహించి అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వార ఏనుగొండకు పంపనున్నట్లు తెలిపారు.రోగులు బి.పి,షుగర్ పరీక్షలు చేసుకొని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని,ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు,ఏదేని ఓ గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ తమవెంట తెచ్చు కోవాలని తెలిపారు.వివరాలకు 9440876556, 7386940480 లో సంప్రదించాలన్నారు.

## విద్యుత్ మరమ్మతుల సమయంలో ప్రమాదం - లైన్మెన్ శ్రవణ్ మృతి





**ఐజ (ప్రజా జ్యోతి) ఫిబ్రవరి 23**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామంలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి లైన్మెన్ శ్రవణ్ మృతి చెందారు.స్థానికంగా అందిన సమాచారం ప్రకారం, శ్రవణ్ గతంలో కూడా అయిజలో లైన్మెన్‌గా సేవలు అందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ఇలాంటి దుర్ఘటనకు గురికావడం అందరినీ తీవ్ర విషాదంలో ముంచేసింది.

ఈ ఘటన పట్ల గ్రామస్థులు, సహచర సిబ్బంది, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం మరియు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు కుటుంబానికి తగిన ఆర్థిక సాయం, న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.అలాగే, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ మరమ్మతుల సమయంలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మంత్రోనిపల్లిలో రేషన్ సబ్ సెంటర్ ప్రారంభం



**ధన్వాడ ఏప్రిల్ 23(ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని మంత్రోనిపల్లి గ్రామంలో రేషన్ షాప్ లేకపోవడంతో గ్రామ ప్రజలు ఇంతకాలం రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది ఈ సమస్యను గ్రామ సర్పంచ్ రవికుమార్ ఎంపీ డీకే అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె స్పందించి చర్యలు తీసుకున్నారుదీంతో గురువారం గ్రామంలో రేషన్ సబ్ సెంటర్‌ను అధికారికంగా ప్రారంభించారు ఎన్నో ఏళు ్లగా ఎదురుచూస్తున్న ఈ సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎంపీ అరుణమ్మకు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంజనేయులు వార్డ్ మెంబర్లు గ్రామస్తులు ఉస్సు కిష్టప్ప లక్ష్మయ్య అంజనేయులు తిరుపతి రవి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయురాలికి గౌరవ వేతనం అందజేత

**చిన్నంబావి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలంలోని కొప్పునూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో గ్రామస్తులు ముందుకొచ్చి విద్యా సేవలను కొనసాగిస్తున్నారు. విద్యార్థుల చదువులో అంతరాయం కలగకుండా వాలంటరీగా ఉపాధ్యాయురాలిని నియమించి, ఆమెకు గౌరవ వేతనం అందజేస్తున్నారు.ఈ క్రమంలో పాఠశాలలో విద్యాబోధకురాలిగా పనిచేస్తున్న శ్రీవిద్యకు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించిన రూ.10,000 గౌరవ వేతనాన్ని గ్రామ సర్పంచ్ వడ్డెమాన్ బిచ్చన్న,ఉపసర్పంచ్ అగ్గన్నగారి సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుకలి శివరాముడు, ఉపాధ్యాయుడు మధు మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సు కోసం సహకరిస్తున్న గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



# స్వీయ గణన ప్రక్రియ.. పకడ్బందీగా పారదర్శకంగా చేపట్టాలి

- జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 23 ॥ (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
నాగర్ కర్నూల్ జిల్లాలో స్వీయ గణన ప్రక్రియను సంబంధిత అధికారులు సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం రూపొందించిన పోర్టల్ ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత వేగంగా, సులభంగా ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఉందని ఆయన పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు మరియు మున్సిపాలిటీల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. సంబంధిత అధికారులు స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నారు.ప్రతి కుటుంబం తమ వివరాలను పూర్తిగా, ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ విజ్ఞప్తి చేశారు. ఎటువంటి తప్పులు లేకుండా సమయానికి సమాచారం అందించడం ద్వారా స్వీయ గణన ప్రక్రియ విజయవంతం అవుతుందని తెలిపారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉన్నచో సంబంధిత మండల కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కార్యాలయం లేదా వార్డు కార్యదర్శిని సంప్రదించవచ్చని సూచించారు. స్వీయ గణన పోర్టల్ 26 ఏప్రిల్ 2026 నుండి 10 మే 2026 వరకు, మొత్తం 15 రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఇండ్ల జాబితా మరియు గణనకు సంబంధించిన 34 ప్రశ్నల వివరాలు పోర్టల్‌లో పొందుపరచబడ్డాయి.
ఇంటింటి గణన (ఫీల్డ్ సర్వే) 2026 మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడుతుంది కలెక్టర్ స్పష్టం చేశారు

## లింగ నిర్ధారణ చట్టం అమలుపై కఠిన చర్యలు

### -- నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్ కర్నూల్ ఏప్రిల్ 23( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
లింగ నిర్ధారణ చట్టం ( పి సి పి ఎన్ డి టి చట్టం) నిబంధనల అమలులో ఎలాంటి రాజీ ఉండదని, కఠిన తరమైన చర్యలు తప్పవని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పష్టం చేశారు.
నాగర్ కర్నూల్ జిల్లాలో కొత్తగా ఏర్పాటవుతున్న క్లినిక్లు, ఆసుపత్రులు మరియు స్కానింగ్ సెంటర్లకు అనుమతులు పూర్తిగా చట్టబద్ధ నిబంధనల ప్రకారమే మంజూరు చేయనున్నట్లు, గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బహుళ సభ్యుల అనుకూల అధికారి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 ఆసుపత్రులు మరియు 3 స్కానింగ్ సెంటర్ల అనుమతి దరఖాస్తుల అనుమతులపై చర్చించారు.సమావేశంలో ప్రతి దరఖాస్తును విడివిడిగా పరిశీలిస్తూ, సంబంధిత కేంద్రాలు చట్టపరమైన ప్రమాణాలను పాటిస్తున్నాయా లేదా అనే అంశంపై కమిటీ సభ్యులు సమీక్షనిర్వహించారు. మౌలిక సదుపాయాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వైద్యుల అర్హతలు, అలాగే స్కానింగ్ యంత్రాల వినియోగానికి సంబంధించిన అనుమతులు వంటి అంశాలను కమిటీ సభ్యులు డి ఎం హెచ్ ఓ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..సమాజంలో బాలికలపై వివక్షను నివారించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని నాగర్ కర్నూలు జిల్లాలో బాలికల నిష్పత్తి కొన్ని మండలాల్లో తక్కువగా ఉందని, గుర్తు చేశారు. కనుక లింగ నిర్ధారణకు సంబంధించిన ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను సహించబోమని, అన్ని వైద్య కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ సూచించారు.అనుమతుల మంజూరులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు, నిబంధనలు పూర్తి చేసిన దరఖాస్తుదారులకే అనుమతులు మంజూరు చేయబడతాయని, లోపాలు ఉన్న దరఖాస్తులను తిరస్కరించడం లేదా సవరణలకు పంపించడం జరుగుతుందని, వచ్చిన 15 ప్రైవేట్ క్లినిక్, మూడు స్కానింగ్ సెంటర్ల దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.జిల్లా స్థాయి కమిటీ సమావేశం ద్వారా వైద్య సేవల నాణ్యతను పెంపొందించడంతో పాటు, లింగ సమతుల్యతను కాపాడే దిశగా కఠిన చర్యలు కొనసాగుతాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డి ఏం హెచ్ ఓ రవికుమార్ నాయక్, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ యం. చెన్నయ్య, ఎన్జీవో లక్ష్మణరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి

**ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలుచేయాలి**
**రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలని**
**ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలిపిన బీసీ జాగృతి సేన**




నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)
నేడు నారాయణపేట జిల్లా ఆర్టీసీ డిపో కార్మికులు చేస్తున్న ఆర్టీసీ రక్షణ కోసం ,సమస్యల సాధన కోసం సాగుతున్న సమ్మెలో బీసీ జాగృతి సేన జిల్లా అధ్యక్షులు ఎల్ల కుర్మయ్య పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.అలాగే 2019 సమ్మె కాలం లో నమోదయిన పోలీస్ కేసులను ఎత్తివేయాలని వారి డిమాండ్లను లను వెంబడే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని. మీరు చేపట్టిన సమ్మెకు మా పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వములో విలీనం చేయాలని, ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు, ఆర్టీసీ రంగంలో పనిచేస్తున్న కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగుల ను గుర్తించి
వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ తర్వాత పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు... పండుగ సందర్భంలో కూడా కుటుంబ సభ్యులకు దూరంగాఉంటూ ప్రయాణికులకుసేవలందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, వారి పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, వారి ఆడపిల్లల వివాహానికి పది లక్షల నగదును అంది వ్వాలనికోరారు, కోరారు. అనంతరం నారాయణపేట నియోజక వర్గం అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయం పోరాటం కావున బీసీ జాగృతి సేన అండగా ఉంటుందని కోరారు ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన జిల్లా నాయకులు గజలప్ప ,మద్దూరు మండల అధ్యక్షులు వెంకటయ్య, బాలు, నర్సిమ,తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ధరిత్రీ దినోత్సవం




నాగర్‌కర్నూల్: ఏప్రిల్ 22 (ప్రజా జ్యోతి)
లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాలతో నాగర్‌కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నాగర్ కర్నూల్ మండలం గగ్గలపల్లి గ్రామంలో ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులు,లయన్స్ సభ్యులతో ప్రత్యేక ధరిత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో రైతుల పాత్ర కీలకమని, రసాయన ఎరువులు,పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రీయ,ప్రకృతి వ్యవసాయం పై ఆసక్తి చూపాలని,ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లకు బదులుగా ఆకులు,గడ్డి వాడాలని,డ్రిప్ ఇరిగేషన్ తో నీటిని పొదుపు చేయాలన్నారు.అనంతరం మొక్కలు నాటడం,విత్తన బంతుల పంపిణీ చేసి రైతులతో "నేల తల్లిని కాపాడుకుంటాం,ప్లాస్టిక్ వాడం, చెట్లు పెంచుతాం"ప్రతిజ్ఞ చేయించి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,క్లబ్ సభ్యుడు దొడ్ల ఈశ్వర్ రెడ్డి చే కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేసారు.ఈ కార్యాక్రమంలో సెక్రటరీ సురేష్ కుమార్,ట్రెసరర్ పరమేశ్వర్ రెడ్డి,డిస్టిక్ కాబినెట్ మెంబెర్ లయన్ డాక్టర్.తెప్ప శ్రీనివాస్,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా తోటపల్లి సుబ్రహ్మణ్య శర్మ శత జయంతి వేడుక




నాగర్ కర్నూల్ : ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)
బిజినపల్లి మండలం పాలెం గ్రామంలోని తోటపల్లి సుబ్రమణ్యం మెమోరియల్ పాఠశాలలో శ్రీతోటపల్లి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ జయంతి వేడుక మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.గోపాలస్వామి 40 సంవత్సరాల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఏయిడెడ్ స్కూల్ కావడంతో ఒకే పాఠశాలలో 40 ఏండ్ల పాటు ఈప్రాంత విద్యార్థులకు డ్రాయింగ్ లో నైపుణ్యం నేర్పించడంతో ఎంతో మంది ఆర్టిస్టులుగా,సివిల్ ఇంజనీయర్ చదువుల్లో,ప్లానింగ్ డ్రాయింగ్ కు తోడ్పాటు అందించారు.ఉపాధ్యాయుడిగానే కాకుండా ఆలయ అభివృద్ధిలో,గ్రామాభివృద్ధిలో చురుకుగా ఉన్న గోపాలస్వామి భవిష్యతులో సామాజిక సేవలో పాలుపంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థుల సంఘం నేతలు శాలువా మెమంటో లతో ఘనంగా సన్మానించారు,పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు సురేందర్,కందాడై శ్రీనివాసచారి, మోహన్ బాబు,వెంకటేశ్వర్ రెడ్డి,జహిందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్,మధు దయానందరావు,సునీత, ఈశ్వరమ్మ,యశోద,శివలీల,ప్రకాష్‌బాబు,రాధ,మంజీర,డా.సుప్రియ,డా.సూర్యనారాయణ,డా.శ్రీ ప్రియ,పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

### -సమాచారం అందించాలని పోలీసుల విజ్ఞప్తి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో) మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళ అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగించింది. మెట్టుగడ్డకు చెందిన కె. విజయ (63), గృహిణి, గురువారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో తన నివాసం నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఆమె భర్త పేరు రాజ్‌వర్ధన్‌గా పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు మరియు పోలీసులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే ఎస్ఐపీ మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులకు 8712659336 లేదా పోలీస్ స్టేషన్ నంబర్ 8712665210కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

